తల్లి గర్భము నుండి జన్మించు నప్పుడు
కంఠ మాల లవేమి కానరావు
మంచి ముత్యపు సరులు మచ్చునకును లేవు
మేలి బంగరు దండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేదు
గోమేధికపు మాల కూడ లేదు
మణుల మాలల నందు పొదిగించగా లేదు
పచ్చల పేర్లను పొదగ లేదు
కలదు కలదొక్క మాల ఏ కంఠమందు
పూర్వ జన్మల కర్మలు పొందు పరచి
బ్రహ్మ మెకిచ్చి పంపెను బరువుమాల
మంచియైనను చెడుగైన తుంచకుండ
కర్మలన్నియు గూర్చిన కంఠ మాల

ప్రేమ స్వరూపులారా!

జన్మకు కర్మమే కారణము. కనుక ప్రతి మానవుడు కూడను కారణ జన్ముడే కర్మద్వారా జన్మించిన యీ జన్మకు ధర్మము ప్రధాన పురుషార్థము. ధర్మమే ప్రథమ పురుషార్థము.

(1) ధర్మమనగా లౌకికంగా, పారమార్థికముగా యీనాడు లోకములో వ్యవహరింప జేసేటు వంటిది జాతి మత కుల వర్ణ లింగ లేక ఆశ్రమము యిలాంటి ఆధారమును పురస్కరించుకొని ధర్మములను మనము అనుభవిస్తున్నాము. ఇది సరియైన అర్థము కాదు ధర్మమునకు దేశకాల పరిస్థితుల ప్రభావమునకు లోనుకాక సర్వత్ర సర్వ మానవులకు, సమస్త దేశములకు సమిష్టి యైన స్వరూపమే ధర్మము. మానవుని ధరించినటు వంటిదే ధర్మము. మానవుని ధరించినట్టిది మానవత్వమే. మానవునకు మానవత్వమే ధర్మము. మానవత్వమనగా ఏమిటి?

మానవత్వమనగ మనసు మాటక్రియ
లన్ని యొక్కటగనె నతికి యుంట
మనసునందు ఒకటి మాటయు క్రియయును
వేరు వేరుగైన విలువ యేమి?

మనస్సు, మాట, క్రియ మూడింటి యొక్క ఏకత్వమే మానవత్వము. ఈ త్రిపుటి యొక్క ఏకత్వము చేత ఆచరించే కర్మలు కూడను ధర్మములే. ఈ త్రికరణ శుద్ధితో చింతించే దంతయు శాంతియే. ఈ త్రికరణ శుద్ధితో నడిచే నడతలంతయు కూడను అహింసతే. ఈ త్రికరణ శుద్ధితో పలికే పలుకులన్నియు సత్యములే. కనుక యిది యావత్ మానవులకు సంబంధించినది ధర్మము.

(2) ఒక కాలమునకు ఒక దేశమునకు, ఒక వర్ణమునకు లేక ఒక లింగమునకు సంబంధించినది కాదు. దేశకాలములకు అతీతమైనది కనుకనే సనాతన ధర్మమని పేరు. ఈ లౌకికమైన జగత్తునందు నూతనమైన ధర్మములు అనేకముగా వెలువడు తుంటాయి. దేశ కాలములతో పుట్టబడినటువంటివి. ఈ దేశకాలములకు సంబంధించిన సర్వధర్మములు కూడను కాలానుసారముగా కదలిపోతుంటాయి, మారిపోతుంటాయి. ఈ సనాతన ధర్మమే మారిన మానవత్వమే వుండదు. అగ్నికి దహనశక్తి, ప్రకాశము దాని సహజత్వము. ఈ సహజమైన ప్రకాశత్వము, యీ దహనత్వము అగ్ని కోల్పోయిన బొగ్గుగా మారిపోతుంది. బెల్లమునకు తీపి సహజ ధర్మము. ఈ బెల్లమునందు తీపితనమనే సహజ ధర్మము కోల్పోయిన యిది మట్టి ముద్దగా రూపొందుతుంది. అదే విధముగనే మానవుని యందు సహజమైనటువంటి యీ త్రిపుటి, త్రికరణ శుద్ధి అనేది వుండినంత వరకే యితను మానవుడు. ఈ త్రికరణ శుద్ధి అనే దివ్యత్వమును కోల్పోయిన వాడు కేవలము ఆకార మానవుడే గాని, సాకార మానవుడు కాదు. మానవ జీవితము అమూల్యమైన మాణిక్యము వంటిది. మాణిక్యమును మసిబొగ్గునకు అమ్ముకున్నట్లుగా యీ దివ్యమైన మానవత్వాన్ని కేవలము విషయవాసనలకు నిరంతరము అంకితము గావించుకుంటున్నాము. దీనికి కారణమేమిటి? మనస్సునందు అనేక రకములైన దోషములు కూడి వుంటున్నవి.

ఇందులో శాస్త్ర రీతిగా నాలుగు దోషములు ప్రధానమైనవి. భ్రమ మొదటిది. రెండవది ప్రమాదము. మూడవది కరణాపాటవం. నాల్గవది విప్రలిప్స. ఈ నాలుగు దోషముల చేతనే మనసు మాలిన్యము పొంది తద్వారా తన యొక్క స్వరూపాన్ని మరచి కేవలము యీ లౌకిక విషయములందు తాను మునుగుచున్నది.

భ్రమ. జగత్తంతయు భ్రమతోనే కూడి వుంటున్నది. వస్తువు యొక్క రూపము

ఒకటిగా వుండినా అనేక రూపములుగా యిది గోచరిస్తుంది. ఇదే భ్రమ. వున్నది ఒకటైతే తలంచటము మరొకటిగా వుంటుంది. సత్యముగను అసత్యముగను, అసత్యమును సత్యముగను భ్రమిస్తూ వుంటుంది. త్రాడును పాముగను, పామును త్రాడుగను భ్రమిస్తుంది. మానవత్వము నిత్యమనే భ్రాంతి చేతనే ఆ సత్యమైన దివ్యత్వాన్ని కొంతవరకు మరచిపోతున్నాడు. దేహము అనిత్యము. అనిత్యమునందే నిత్యము వుంటున్నది. నిత్య అనిత్యముల యొక్క స్వరూపమే మానవత్వము. అనిత్యము దేహము. నిత్యము దేహి. కాని దేహిని మరచి దేహమనే విశ్వసిస్తున్నాము. మనము అసత్యమును సత్యముగను, నిత్యమును అనిత్యముగను విశ్వసిస్తున్నాము.

ఈ భ్రాంతి చేతనే ఏనాటికో ఒకనాడు మనదేహమును కోల్పోతున్నాము. ఈ ప్రమాదమునకు మనము గురౌతున్నాము. కనుక భ్రమ చేతనే ప్రమాదము మనకు సంభవిస్తున్నది. ఈ భ్రమ ప్రమాద సమ్మిళితమైన స్వరూపమే మనము కరణము ద్వారా అనుభవిస్తున్నాము.

మూడవది కరణాపాటం. కరణమనగా యింద్రియము. అది ఒక పనిముట్టు. పటన అనగా దౌర్బల్యము. ఈ యింద్రియములకు ఒక విధమైన దౌర్బల్యము వుంటున్నది. మనస్సు స్వయంగా పదార్థములను చూడలేదు. కేవలము యింద్రియములను ఆధారము చేసుకొనియే పదార్థములను చూడగలుగుచున్నది. మనస్సు స్వయంగా వినలేదు. చెవులను ఆధారము చేసుకొనియే విశ్వమును వింటున్నది. ఈ విధముగా మనసు యింద్రియములను ఆధారము చేసుకొనియే సర్వకర్మలను ఆచరిస్తున్నది. ఐతే యీ యింద్రియములు అనేక లోపములతో కూడినది. అనేక దౌర్బల్యములతో చేరిన టువంటిది. కేవలము అనిత్యమైనవి. ఇవి రోగములతో చేరినవి. ఇట్టి అనిత్యము అశాశ్వతము అసత్యమై రోగపీడితమైన యింద్రియములను ఆధారము చేసుకొని మనసు అనుభవించటం చేత యీ యింద్రియముల దోషము మనస్సునందు ప్రతిబింబిస్తున్నాయి. కనుక యింద్రియ దోషముల చేత మనస్సు మాలిన్యము చెందుతున్నది. ఇది చాలా పరిశుద్ధమైనది. చాలా పవిత్రమైనది. కాని సహవాసము చేత అది మాలిన్యము పొందుతున్నది. ఈ సంగ దోషముల చేతనే మానవుడు మంచి చెడ్డలు అనుభవిస్తున్నాడు. మట్టిగాలితో సహవాసము చేసినప్పుడు గగనము వరకు ఎగురుతుంది. నీటితో సహవాసము చేసినప్పుడు గుంటలో దిగుతుంది. క్రిందికి దిగుటకు మట్టికి కాళ్లు లేవు. ఆకాశమునకు ఎగురుటకు రెక్కలు లేవు మట్టికి. సహవాస దోషము వలనే ఆకాశములో ఎగురుతున్నది. గుంత వరకు దిగుతున్నది. కనుక మానవుడు కూడను యీ సహవాస దోషముల చేతనే మనసు మాలిన్యము గావించుకొని తద్వారా దుఃఖములకు వికారములకు గురౌతున్నాడు. మన సహవాసము ఎట్టిదో మనం

అట్టివారుగా రూపొందుతాము. దీనికి ఐన్‌స్టీన్ కూడను ఒకసారి చెప్పాడు 'Tell me your company I shall tell you what you are'. నీవు ఎట్టి సహవాసము చేతువో అట్టి స్వభావమునే నీవుకూడను పొందుతావు. కనుకనే వేదాంతమునందు

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం

నిర్మోహత్వే నిశ్చల తత్త్వం నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః.

మానవునకు సత్సంగము అత్యవసరము.

ఇంక నాల్గవది విప్రతిపత్తి. విప్రతిపత్తి అనగా అసూయ. ఈ అసూయ మహా చెడ్డ గుణము. ఇది వున్నవారిని చూచి ఓర్వలేదు. కలిమి కలిగినవానిని చూస్తే కాలిమి లేకనే కమిలి పోతుంది. నిరంతరము పరుల దోషములనే వెతుకుతుంది. పరులయొక్క కీడునే ఆశిస్తుంది. మంచిని ఏనాటికిని చింతించదు. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' తన చింతలు ఎట్టివో లాను అట్టి రూపాన్ని ధరిస్తుంది. ఈ అసూయ మానవుని రాక్షసునిగా మారుస్తుంది. మానవునికి యీ అసూయ మహా పాపకరమైన దోషము. ఈ దోషములన్నియు కూడను మనస్సుపైన ప్రవేశిస్తున్నవి. మనసు మంచిదైనప్పటికిని యీ సంపర్కముచేత మనస్సు మాలిన్యము పొందుతున్నది.

3 కనుక వేదాంతము మల, ఆవరణ, విక్షేపములను దూరము గావించుకోమని బోధిస్తుంది. ఈ మలినము మలము వంటిది. మలమును ఎవ్వరూ కూడను ప్రీతిగా ఆశించరు ఎవరు చెంత చేర్చరు. కనుకనే మాలిన్యము చెందిన మనస్సు ఎవరిని చేరదు. నది పుట్టే సమయములో అతి పరిశుద్ధమైన జలముగా పుడుతుంది. కాని అనుభవించే మనుష్యుల స్థాయికి వచ్చేటప్పటికి మాలిన్యము చెందుతుంది. అదేవిధముగనే మనో ప్రవాహమనేది పరిశుద్ధముగా ప్రవహించింది. దీనిని అనుభవించే మానవుని చెంత చేరేటప్పటికి మాలిన్యము చెందుతున్నది. ప్రపంచములో యీ అసూయ ద్వారానే అనేక దుఃఖములకు గురౌతున్నారు. పరులపైన అసూయకల్గి వారి చెడ్డను నీవు ఎంత కోరుదువో, ఎదుటివారికి చెడ్డను అందించి అంతకంటె అనేకరెట్లు ఆ చెడ్డనే తనకే ఎదురు తిరుగుతుంది. మహాభారతమునందు యీ అసూయ యొక్క ప్రభావము మీకందరికి తెలుసు. పాండవులను చూచి కౌరవులు ఎంత అసూయపడిరో తిరిగి కట్టకడపటికి ఆ అసూయ వారినే ధ్వంసము చేసింది. వారిని నాశనము గావించింది. ఈ అసూయ చేత క్రోధము పెరుగుతుంది. క్రోధము కలిగినవానికి మానవత్వము ఏమాత్రము అర్థముకాదు.

తనకలిమి భంగపుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తనవారల కెడ సేయును
జనులకు కోపంబువలన సర్వము చెడున్.
కోపము కలిగినవానికి
ఏ పనియు ఫలింపకుండు విఘ్నలు కలుగున్
పాపము పనులు చేయుచు
చే పాపమ్మని పించుకొనుట చేకురుసుమీ!

ఇట్టి మాలిన్యములు కూడిన మనస్సుతో మనము సాధనలు చేసినప్పుడు యీ సాధనలు ఎట్లా వుంటాయి. బురదను బురదతో కడిగినట్లుగా వుంటాయి. కనుక మనస్సుకు వుండిన యీ దోషముల చేత ఎన్నిసాధనలు చేసినప్పటికి యే మాత్రము పరిశుద్ధము గాదు.

4 మొట్టమొదట మనస్సుకు చేరిన యీ మాలిన్యము నిర్మూలము గావించుకోవాలి. ఇది ఏ రీతిగా నిర్మూలమవుతుంది. సంఘసేవయందే..ఏకాత్మయందే యీమాలిన్యము నిర్మూలమవుతుంది. కనుక మనము ఏకాత్మభావమును పొందాలి. ఈ ఏకాత్మభావము సేవయందు మాత్రమే మనకు లభ్యమవుతుంది. ఈ మనస్సుకు మరొక పేరు కూడను వుంటున్నది. అంతఃకరణ. అంతఃకరణ అనగా లోపలియింద్రియము. లోపలి పనిముట్టు అని. అంతఃకరణయందు యిది నిత్యానిత్య విషయపరిశీలన గావించటానికి ప్రయత్నిస్తుంది. ఈ నిత్యానిత్య విషయ పరిశీలన చేసే స్వభావము కలిగివుండటము చేత దీనికి బుద్ధి అనిపేరు వచ్చింది. ఇదిమహా సూక్ష్మమైనటువంటిది. దేహముకంటె యింద్రియము, యింద్రియముకంటె మనస్సు, మనస్సుకంటె బుద్ధి ఒకదానికొకటి సూక్ష్మమైన స్వరూపాలు. ఈ బుద్ధికంటె సూక్ష్మమైనది ఆత్మ. ఈ బుద్ధి ఆత్మకు సమీపంగా వుండటం చేత యిది ప్రభవంతమైనదిగావుంటుంది. బుద్ధిగలవాడే శ్రద్ధ బూని ఉన్నత స్థానము పొందగలడు. ఐతే బుద్ధి అనేది ఒక అద్దము వంటిది. అద్దము ఎంత పరిశుద్ధము అయినప్పటికిని దాని వెనుక భాగములోపల పాదరసము పూయాలి. అట్లు కాకుండా అద్దము ఎంత పరిశుద్ధమైనదైనప్పటికిని పాదరసము పూయకుండిన నీ ప్రతిబింబము కనుపించదు. అటులనే బుద్ధి చాలా పవిత్రమైనది, విలువైనది, బలమైనది. అయినప్పటికి దీనికి మరొక వైపున ప్రేమ అనే రసాన్ని పూసినప్పుడే యిందులో నీ యొక్క స్వరూపాన్ని సుస్పష్టంగా నీవు చూడగలవు. ప్రేమ చేతనే నీ స్వరూపాన్ని నీవు దర్శించగలవు స్వస్వరూపమును సత్రించుటమే

సరియైన మానవత్వము. ఈనాటి మానవుడు తనను తాను మరచి ప్రపంచాన్ని తెలుసుకొనుటకై ప్రయత్నిస్తున్నాడు. మానవునకు అన్నియూ తెలియును గాని తానెవరో తనకు తెలియదు. తనను తాను తెలుసుకొనలేక అన్ని తెలుసుకొని ప్రయోజనము ఏమిటి? కనుక మొట్ట మొదట తనను తాను తెలుసుకొనుటకు ప్రయత్నించాలి. తనను తాను తెలుసుకొనుటకు ప్రేమయే ఆధారము. ప్రేమయే ప్రధానము. ప్రేమయే ప్రమాణము. కనుకనే బుద్ధిని ఉపనిషత్తులు ఒక పక్షితో పోల్చాయి. ఈ పక్షికి రెండు రెక్కలు ఒక తోక వుంటాయి. ఈ తలకే శ్రద్ధ అని పేరు పెట్టారు. కుడివైపున రెక్కకే ఋతము అన్నారు. ఎడమవైపు రెక్కనే సత్యం అన్నారు. తోకనే యోగము అన్నారు.

ఏతావాతా బుద్ధి అనగా శ్రద్ధ, ఋతము, సత్యము, యోగములతో కూడినది. శ్రద్ధ అనగా ఆసక్తి. ఈ శ్రద్ధ లేకుండిన మానవుడు ఏ చిన్న కార్యము పూనుకోడు. శ్రద్ధగలవాడు ఎట్టి ఘనకార్యమునైనా సాధించగలడు. కనుకనే వేదాంతము 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అనింది. శ్రద్ధ వున్నచోట ఎంత కష్టమైన ప్రతి మానవుడు ఎంత కష్టమైన దానినైనా సాధించటానికి పూనుకుంటాడు. శ్రద్ధ లేకుండిన ఏ చిన్న కార్యములో కూడను విజయాన్ని సాధించలేడు. కనుక శ్రద్ధతో కూడినది బుద్ధి.

ఇక ఋతము. ఋతము అనగా కేవలము త్రికరణములతో కూడినటువంటిది. మనస్సు వాక్కు క్రియ మూడింటి ఏకస్వరూపమే ఋతం. ఏతావాత యీ త్రికరణ శుద్ధితో కూడినదే బుద్ధి అని. ఇంక సత్యము అనగా ప్రాకృతమైనది. చూచినది చూచినట్లు, విన్నది విన్నట్లు, చేసినది చేసినట్లు వాక్కు ద్వారా వుచ్చరించటమే యిది సత్యము. ఐతే సత్యమునకు ఋతమునకు వుండిన వ్యత్యాసము గుర్తించటానికి మనము ప్రయత్నించాలి. సత్యము అప్పటికప్పుడు జరిగిన విషయానికి మాత్రమే వివరంగా బోధిస్తుంది. కానీ ఋతము త్రికాలములందు మారని సత్యాన్ని గుర్తిస్తుంది. ఒక వ్యక్తిని నీవు చూచినప్పుడు బుష్‌కోటు వేసుకోవచ్చు, ప్యాంటు ధరించవచ్చు. అప్పటికది సత్యమే. రేపటి దినము అతను పైజమా కురతా వేసుకోవచ్చు, రేపటికి అది సత్యము. అప్పటికప్పుడు నీవు గుర్తించగలిగేది సత్యము. త్రికాలములందు కూడను మారనటువంటిది ఋతము. కనుక శ్రద్ధ, ఋతము, సత్యములతో కూడినటువంటిది బుద్ధి.

ఇంక తోక యోగము. యోగమనగా ఏమిటి? కూడిక, చేరిక. ఒకదానిలో ఒకటి చేర్చేటువంటి సమత్వముతో కూడినది. చిత్తవృత్తులకు లోబడునటువంటిది కనుకనే పతంజలి యోగః చిత్తవృత్తి నిరోధః అన్నాడు. చిత్తవృత్తిని అరికట్టేది. ఆ చిత్తవృత్తిని అరికట్టినప్పుడే తాను

ఏ ప్రదేశమునకైనా, ఏసమయమునందైనా తాను ప్రయాణము చేయగలదు. గాలిలో కూడను ఎగర గలదు. ఈనాడు పక్షులను మనం చూస్తున్నాము. రెండు రెక్కలు ఒక తోక వుండటం చేతనే ఆకాశములో సంచరిస్తున్నాయి. రెక్కలు వుండి తోక లేకపోతే అది ఆకాశములో సంచరించలేదు. తోక వుండి రెక్కలు లేకపోతే అది ఆకాశములో ఎగురలేదు. కనుకనే బుద్ధి సర్వవ్యాపకత్వము పొందటానికి ఋతము, సత్యము, యోగము వీటి ఆధారము చేతనే బుద్ధి పవిత్రమైన సూక్ష్మ స్వరూపాన్ని పొందుతున్నది. కనుకనే బుద్ధిగ్రాహ్య మతీంద్రియం అన్నారు.

ఈనాటి మానవుడు బుద్ధిగొప్పదా, మేధస్సు గొప్పదా అని విచారణ చేసుకుంటే పండితులు మొదలు పామరులవరకు మేధస్సు గొప్పదని నిర్ణయం చేస్తారు. కాని దీనిని వేదాంతముగాని, ఉపనిషత్తులుగాని అంగీకరించదు. బుద్ధి కంటె మేధాశక్తి చాలా చిన్నదని భావిస్తుంది. మేధాశక్తి యేమాత్రము పనికిరాదని నిర్ణయం చేసుకుంది. ఒకానొక సమయమందు విక్రమాదిత్యుడు యీ బుద్ధి గొప్పదా మేధాశక్తి గొప్పదా అని సమావేశము జరిపించాడు. అనేకమంది పండితులందరు మేధాశక్తి గొప్పదని భావిస్తూ వచ్చారు. విక్రమాదిత్యుడు లేచాడు. ఆస్థ స్వాస్థ లేని మేధాశక్తి నిష్ప్రయోజనం అన్నాడు. ఆస్థ అనగా కేవలము ఒక విధమైన ఆసక్తియే. స్వాస్థ అనగా స్థిరత్వము అని. ఇకడ ఆసక్తి, స్థిరత్వము లేని మేధాశక్తి ఏమి ప్రయోజనం వుంటుంది అని నిర్ణయించాడు. ఈనాటి మేధావులందు స్థిరత్వము ఎక్కడను కనుపించటం లేదు. సామాన్యమైన మానవునియందు స్థిరత్వము వుంటుందిగాని మేధావులందు స్థిరత్వము వుండుటలేదు. గొప్ప మేధావంతులు అనుకుంటున్నారుగాని అన్ని సందేహములే వారికి. మేధాశక్తి యొక్క ప్రభావములు యివి. దేనిని విశ్వసించరు. అలాంటి విశ్వాసము లేని మేధాశక్తి ఏమి ప్రయోజనము. కనుక స్థిరత్వము వుండినదే బుద్ధి. ఆసక్తితో కూడినదే బుద్ధి. ఋతముతో చేరినదే బుద్ధి. సత్యముతో చేరినదే బుద్ధి. యోగముతో కూడినదే బుద్ధి. శ్రద్ధతో చేరినదే బుద్ధి. ఇన్ని పవిత్ర గుణములు కలిగిన యీ బుద్ధిని మేధాశక్తి ముందు ఏమాత్రము పోల్చుకొనుటకు వీలౌతుందా?

కనుక యీనాటి మానవులు మేధావులకంటె బుద్ధిమంతులవటం అతి ఉత్తమము. బుద్ధిమంతులకు వినయ విధేయతలుంటాయి. విశ్వాసము, స్థిరత్వము వుంటాయి. మేధావులందు వినయవిధేయతలు యేమాత్రము కనుపించవు. మేధావులకు అహంకారము యిబ్బడిపోతుంటుంది. బుద్ధికంటె అహంకారము మరింత సూక్ష్మమైనది. బుద్ధిని కూడను భ్రష్టుపట్టిస్తుంది అహంకారము. కనుక మనము అహంకారమునకు చోటివ్వక బుద్ధిని అనుసరించి దివ్యత్వమును అర్థము చేసుకొనుటకు ప్రయత్నించాలి. ఆనాటి మహామేధావులు బుద్ధికే ప్రాధాన్య

421119008

తను యిస్తూ వచ్చారు. శంకరులవారు క్షేత్ర యాత్ర జరిపినప్పుడు మండన మిశ్రుని దగ్గర వాదోప వాదములు జరిగాయి. వారిరువురకు వాదోప వాదములు ప్రారంభమైనాయి. ఎవరు విజయమును సాధించారు అనేదానిని నిర్ణయించే వారు ఒకరు వుండాలి. జయాపజయములు నిర్ణయించే జడ్జి ఆ యిరువురికి అవసరమైంది. శంకరులవారు యోచించారు. ఋతము, సత్యము, యోగము శ్రద్ధ వుండిన వ్యక్తియే మా యిరువురి యొక్క జయాపజయములు నిర్ణయించే అధికారము వుంది అనుకున్నాడు. అలాంటి వారికి యే విధమైన బేధములు వుండవు. ఋతము వుంటున్నది. త్రికాలముల యొక్క యోచన. త్రికాలముల యొక్క సమన్వయము. సత్యము వుంటున్నది. అప్పటికప్పుడు విషయాన్ని సాధించే సత్యము. ఇట్టి గుణములు కలిగినవారు స్వపర బేధము లేకుండా జయాపజయములు నిర్ణయించగలరు. ఈ జడ్జిమెంటు కోసము మండన మిశ్రుని భార్యయైన ఉభయ భారతిని నిర్ణయించాడు శంకరులవారు. చూశారా! ఎవరితో తాను వాదన చేస్తున్నాడో అతని యొక్క భార్యనే జడ్జిగా నిర్ణయం చేసుకున్నాడు శంకరులవారు. ఈ విషయాన్ని చక్కగా విచారిస్తే యీ ఉభయ భారతి ఎంతటి గుణవంతురాలో, ఎంతటి బుద్ధిమంతురాలో, ఎంతటి శ్రద్ధా నిష్ఠలు కలిగినటువంటిదో, ఎంతటి పవిత్ర హృదయమో అర్థమవుతుంది. కనుకనే లోకమునందు దైవత్వమునకు భిన్నత్వమునకు, లోకత్వమునకు, జీవత్వమునకు నిర్ణయము చేసే అధికారము ఎవరికినీ లేదు. కారణమేమనగా లోక మానవులు భ్రమతో కూడినవారు. భయముతో చేరినారు. కనుకనే భయ భ్రాంతులనేవి మానవునకు అనేక విధములైన అశాంతికి గురి చేస్తాయి.

(6) భయ భ్రాంతులకు మనము దూరమై యీ ప్రమాదము మనము తప్పించుకోవాలంటే ఒక్క ప్రేమ తత్వాన్ని మాత్రమే పెంచుకోవాలి. ఈ ప్రేమ చేత సర్వ మానవులయందు వుండిన ఆత్మ తత్వము ఒక్కటే యని గుర్తించి వర్తించాలి. ఈ సత్యము నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక వైజ్ఞానిక అన్నిరంగములందు చక్కగా స్పష్టీకరణ చేస్తుంది. సైంటిస్టులు దీనిని పరిశోధన చేస్తూ వచ్చారు. Electrons, nutrons, protons అని అనేక రకములుగా దీనికి పేర్లు పెట్టుకుంటూ వచ్చారు. ఈ అన్నింటియందు వున్న దివ్యశక్తి ఒక్కటే. ఆ ఒక్క దివ్య శక్తిని మనము గుర్తించుకుంటే యిక మనము అన్నింటియందు ఏమాత్రము యోచించనక్కరలేదు. ఒకరు గులాబ్ జామ్ అంటారు. ఒకరు బర్ఫీ అంటారు. ఒకరు ఖీర్ అంటారు. ఇవన్నీ పేర్లు. ఒక్క చక్కెరే అన్నింటియందు ఉనే విషయాన్ని గుర్తించుకుంటే వీటిలో యేమాత్రము బేధము వుండదు. కనుక electrons, neutrons, protons లో వుండిన దివ్యశక్తి ఒక్కటే. రూపనామములు వేరు వేరు గాని దివ్యత్వము ఒక్కటే.


మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే
వస్త్ర భేదము వేరు వస్త్రమొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటె
జీవ జంతులు వేరు జీవుండు ఒక్కడే
పూల జాతులు వేరు పూజలొకటె
తెలివి లేకను మానవుల్ తెలివిదప్పి
బ్రతుకు కోసము బహు బాధ బడ్డ్రైరి.

లోకములో బ్రతుకు నిమిత్తమై యున్న విధములైన భేదములు పుట్టించుకుంటూ వస్తున్నారు. దీని పేరే ప్రకృతి. ఈశ్వరుని యొక్క శక్తి స్వరూపమే ప్రకృతి. ఈ ప్రకృతికి జగత్తు అని మరొక పేరు. జగత్తనగా ఏమిటి? జ-గత్ వచ్చిపోయేటువంటిదే యీ జగత్తు. ఇందు శాశ్వతమైనది ఒక్కటి లేదు. ఈ జగత్తునందు అన్ని శాశ్వతమే. అన్ని అశాశ్వతమే. సత్యాసత్యములతో కూడినది. నిత్యానిత్యములతో కూడినది యీ జగత్తు. త్రికరణ శుద్ధితో కూడినప్పుడు అన్ని సత్యమే. త్రికరణములు వేరువేరైనప్పుడు యివన్నియు అసత్యమే. కనుక మానవుడుగా బ్రతకాలనుకుంటే త్రికరణ శుద్ధిని మనము పెంచుకోవాలి. త్రికరణ శుద్ధి గలవాడే మానవుడు. లేకపోతే మానవుడే కాదు. ఏనాడు త్రికరణ శుద్ధితో మానవుడుగా మనము జీవించుదుమో మాధవత్వమనేది మనకు చక్కగా అర్థమవుతుంది. ఈ శుద్ధి కలగాలనుకుంటే కర్మను ఆచరించాలి. ఎట్టి కర్మను ఆచరించాలి. పవిత్రమైన కర్మలు, పరోపకార సంబంధమైన కర్మలు, సహజ కర్మలు, సహజమైన ప్రేమ కర్మలు పరులకు ఆనందము నందించే కర్మలు పరులకు అపకారము చేసే కర్మలు కాదు. ఉపకార సంబంధమైన కర్మలు ఆచరించాలి. అతనే ధన్యుడు. వేమన చిన్న పదములలో చెప్పాడు.

నొప్పించక తానొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు వేమా

అన్నాడు. ఒకరిని నొప్పించక తాను బాధపడక యితరులకు సరియైన సేవలు సలుపుచు తప్పించుకు తిరిగే దైవత్వాన్ని మానవుడు పొందాలి. ఈ పదునెనిమిది పురాణములు బోధించే బోధ ఇస్తూ వున్నాయి.

అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచన ద్వయం
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.


421119010

Help ever hurt never. అని రెండు పదములలో చెప్పింది. ఇతరులను నొప్పించకుండా
సాధ్యమైనంత వరకు వారికి సహాయము చేసే మార్గములో మనము ప్రవేశించటమే సేవ అనిపేరు
కనుక భగవన్నామముచేత సేవలు సలుపుతూ పరోపకారదీక్షను పూని దివ్యత్వాన్ని మనము
గుర్తించి ఆత్మతత్వము ఆనందమును అనుభవించాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నాప్రసంగాన్ని విర
మిస్తున్నాను

1990 నవంబరు 21వ తేదీ శాంతివేదిక, శ్రీసత్యసాయి హిల్ వ్యూస్టేడియంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం.